సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 12 । ఆగస్టు । 2024



గజరాజసమేది?
ఏనుగులు ప్రస్తుతం అంతరించిపోయే దశకు చేరాయి. సోమవారం ప్రపంచ ఏనుగుల సంరక్షణ దినోత్సవం. 8లో



కావడి భుజాన పెట్టి..
నగరంలోని మార్వాడీలంతా కాషాయ వస్త్రాలు ధరించి భక్తి శ్రద్ధలతో శోభాయాత్ర నిర్వహించారు. 8లో



ఆర్థిక సంఘం ఛైర్మన్‌కు స్వాగతం
16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగారియాకు విశాఖ విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. 8లో

వందే యువతరం

నేడు అంతర్జాతీయ యువజన దినోత్సవం

నరాల బిగువు.. కరాల సత్తువ.. మేధోసంపత్తితో కూడిన యువశక్తి మన దేశ సొంతం. 'ఉక్కు సంకల్పం కలిగిన కొద్ది మంది యువతను నాకు ఇస్తే.. ఈ దేశ గతిని మార్చేస్తా..' అన్నారు వివేకానందుడు. అదీ ఆయనకు దేశ యువతపై ఉన్న నమ్మకం. ఆ మాటలే స్ఫూర్తిగా ఎంతో మంది యువత తమ కలలను సాకారం చేసుకుంటూ.. సమాజానికి మేలు చేస్తున్నారు. కష్టపడితే అసాధ్యం అనేది ఏమీ లేదని నిరూపిస్తున్నారు. యువతలోని కార్యదీక్ష.. కర్తవ్య నిర్వహణ.. పోరాట పటిమలను మరోసారి గుర్తు తెచ్చి.. పదునెక్కించి ముందుకు నడిపించే రోజు 'అంతర్జాతీయ యువజన దినోత్సవం'. ఇక్కడ ప్రస్తావించిన కొందరు ప్రతిభావంతులైన యువతీ యువకుల కథలు మనందరికీ స్ఫూర్తినిస్తాయి. వారి కృషి, నిబద్ధత, లక్ష్యం వైపు పయనిస్తున్న తీరు ప్రేరేపిస్తాయి.

– సాక్షి నెట్‌వర్క్, విశాఖపట్నం





సాహితి.. స్ఫూర్తి

కొమ్మాది: పట్టుదలతో కృషి చేస్తే సాధించలేనిది ఏమి లేదని ఎండాడకు చెందిన బొల్లాప్రగడ శ్రీ సాహితి నిరూపిస్తోంది. చిన్న వయసులోనే స్కేటింగ్‌పై మక్కువ పెంచుకున్న ఆమె నిరంతరం సాధన చేస్తూ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకుంది. ఇప్పటి వరకు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ఐదు అంతర్జాతీయ పతకాలు, 23 జాతీయ, 30 రాష్ట్ర, 36 జిల్లా పతకాలు సాధించింది. ఇందులో 47 బంగారు, 38 రజిత, 9 కాంస్య పతకాలు ఉన్నాయి. నిరంతర సాధన చేస్తూ. అందరి మన్ననలు పొందుతున్న సాహితి.. నేటి యువతకు స్ఫూర్తి.



చదువు.. సేవ

మల్కాపురం : స్థానిక సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో డిగ్రీ చదువుతున్న గౌతమి సేవా కార్యక్రమాల్లో ముందంజలో ఉంది. ఇంటర్‌లో జాతీయ సేవా పథకం వలంటీర్‌గా చేరిన ఆమె.. పారిశ్రామిక ప్రాంతంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టింది. స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు మొక్కలు నాటడం, పేదలకు వైద్య సహాయం, అవగాహన సదస్సులు నిర్వహించింది. ఎన్ఎస్ఎస్ విభాగం తరఫున చైనాలో పర్యటించి.. ఇక్కడి విద్యా, యువజన విధానాలను అక్కడి విద్యార్థులకు వివరించింది. ఉత్తమ సేవలతో ఐదుసార్లు ఎన్ఎస్ఎస్ వలంటీర్ అవార్డులను కైవసం చేసుకుంది.



పంచ్ కొడితే పతకమే

మల్కాపురం: బాక్సింగ్‌లో బాలురుతో సమానంగా రాణిస్తూ.. జాతీయస్థాయిలో పతకాలు కొల్లగొడుతోంది రేష్మా. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం యాదవ వీధికి చెందిన వాకాడ సన్యాసిరావు ఆటోడ్రైవర్. ఆమె పెద్ద కుమార్తె రేష్మా యాదవ్ ఒకవైపు చదువు, మరో వైపు తనకు ఇష్టమైన బాక్సింగ్‌లో రాణిస్తూ ఈ ప్రాంత ప్రతిష్టను ఇనుమడింపజేస్తోంది. ప్రస్తుతం మల్కాపురం జీవీఎంసీ కళాశాలలో ఇంటర్ ప్లస్ టూ చదువుతున్న ఆమె.. 2017 నుంచి బాక్సింగ్‌లో శిక్షణ తీసుకుంటోంది. 2020లో తొలిసారి నగరంలోని పోర్టు మైదానంలో జరిగిన జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో 50 కిలోల విభాగంలో పాల్గొని రజత పతకం సాధించింది. అక్కడి నుంచి ఆమె పతకాల వేట కొనసాగుతోంది. ఇటీవల గోవాలో జరిగిన జాతీయ బాక్సింగ్ పోటీల్లో 60 కిలోల విభాగంలో బంగారు పతకం, కోల్‌కతాలో జరిగిన అంతర్జాతీయ చెస్ బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. తన ఊపిరి ఉన్నంత వరకు బాక్సింగ్ క్రీడను కొనసాగిస్తానని చెప్పింది. క్రీడల కోటాలో ఉద్యోగం సాధించి.. అలా వచ్చిన జీతంతో పేద క్రీడాకారులను ప్రోత్సహించాలన్నదే తన లక్ష్యమని పేర్కొంది.



సినిమా.. వ్యాపారం

కొమ్మాది: **కలలు కనండి** వాటిని **సాకారం చేసుకోండి** అన్న **అబ్దుల్ కలాం మాట**లకు ఆకర్షితుడై **ఒక వైపు వ్యాపారం చేస్తూ.. మరో వైపు సినిమాల్లో రాణిస్తున్నాడు జిల్లాకు** చెందిన **ఓంకార్ మాటూరి. స్వాతి** చినుకు **సంధ్య వేళలో, ష్ గప్ చుప్** సినిమాల్లో హీరోగా నటించాడు. త్వరలోనే **ఓంకార్ నటించిన మరో** సినిమా బండెనక బండికట్టి విడుదల కానుంది. 'సైంధవ్'లో ఓ పాత్ర పోషించిన ఆయన.. నటుడు విజయ్ దేవరకొండ నటిస్తున్న ఓ సినిమాలో ఓ పాత్ర పోషిస్తున్నాడు. వ్యాపారం తనకు ఆర్థికంగా చేయూతనిస్తోందని.. సినిమా కలను సాకారం చేస్తోందని చెబుతున్నాడు.



మోడల్.. మోడలింగ్ స్కూల్

బీచ్‌రోడ్డు: మోడల్‌గా రాణిస్తే చాలనుకున్న ఆమె ఏకంగా మోడలింగ్ స్కూల్‌నే ఏర్పాటు చేశారు. తద్వారా వందలాది మంది మోడలింగ్ రంగంలో రాణించేందుకు తనవంతు కృషి చేస్తున్నారు. ఆమే నగరానికి చెందిన భారతి బెహ్రి. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో 2016లో జరిగిన మిస్ వైజాగ్ పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. ఆ పోటీల్లో స్మైలీ టైటిల్‌ను సొంతం చేసుకున్నారు. అప్పటి నుంచి నగరంలో జరిగే ఫ్యాషన్ షోల్లో పాల్గొని.. తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ఈ క్రమంలో 2022లో ఇలాహి మోడలింగ్ స్కూల్‌ను ఏర్పాటు చేశారు. మోడలింగ్‌పై ఆసక్తి ఉన్న వారికి శిక్షణ ఇస్తూ.. ఈ రంగంలో రాణించేలా కృషి చేస్తున్నారు. ఇప్పటి వరకు 500 మంది వరకు ఈ స్కూల్ నుంచి మోడలింగ్ రంగంలోకి వచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించే అందాల పోటీల్లో ఆమె విద్యార్థులే.. ఎక్కువ శాతం విజేతలుగా నిలవడం ఓ ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.



పెందుర్తి టూ రష్యా

పెందుర్తి: షేక్ అయేషా.. బ్రిక్స్ దేశాల యూత్ మినిస్టర్స్ సదస్సుకు భారత్ తరఫున హాజరైన ఏకైక తెలుగు అమ్మాయి. హైదారాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్న ఆమెది పెందుర్తి మండలం సరిపల్లి. చిన్ననాటి నుంచి సామాజిక సేవల్లో ముందుండే అయేషా యూనివర్సిటీలో కూడా అదే పంథాలో ముందుకెళ్తోంది. ఈ క్రమంలో బ్రిక్స్ దేశాల సదస్సులో పాల్గొనే సువర్ణావకాశం అయేషాను వరించింది. ఇటీవల రష్యాలోని ఉలియనోస్క్ వేదికగా ఐదు రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో తన మదిలో మెదిలిన భావాలను వేదికపై నిలబడి సగర్వగా చాటి చెప్పింది. సామాజిక సేవ అంశంలో బ్రిక్స్ దేశాల మధ్య ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ ఉంటే బాగుంటుందని ప్రతిపాదన చేసిన ఆమె.. యూత్ లీడర్‌షిప్, సంస్కృతి తదితర అంశాలపై బ్రిక్స్ దేశాల యువత తమ ఆలోచనలు పరస్పరం పంచుకోవాలని సూచించింది.

నిరుపేద కుటుంబం

సరిపల్లికి చెందిన అయేషా తండ్రి షేక్ వెంకటరమణ లారీ డ్రైవర్. తల్లి మదీనా స్థానికంగా చికెన్ దుకాణం నిర్వహిస్తున్నారు. వీరికి ముగ్గురు ఆడపిల్లలు. కాగా ముగ్గురూ ఉన్నత చదువులు అభ్యసించారు. అయేషా జిల్లాలోని ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే డిగ్రీ వరకు పూర్తి చేసింది. అనంతరం విజయనగరంలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో పీజీ పూర్తి చేసి.. మూడేళ్ల కిందట హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో సింథటిక్ కెమిస్ట్రీ విభాగంలో పీహెచ్‌డీలో చేరింది. ఈ క్రమంలో బ్రిక్స్ దేశాల యూత్ మినిస్టర్స్ సదస్సుకు హాజరై.. తన అభిప్రాయాలను వెల్లడించింది.

ఆనందంగా ఉంది

దేశం తరఫున తెలుగు రాష్ట్రాల నుంచి నేను ఒక్క దాన్నే బ్రిక్స్ యూత్ సదస్సులో పాల్గొనడం సంతోషంగా ఉంది. నిరుపేద కుటుంబం నుంచి వచ్చి.. దేశం తరఫున ప్రాతినిధ్యం వహించిన ఆనందాన్ని మాటల్లో చెప్పలేకపోతున్నా.. నాన్న లారీ డ్రైవర్. అమ్మ చికెన్ దుకాణం నడుపుతోంది. ముగ్గురం ఆడపిల్లలం. సొంతిల్లు కూడా లేదు. చదువు పరంగా మా అక్కలతో పాటు నన్ను కూడా అమ్మానాన్న ఎంతో ప్రోత్సహించారు. తల్లిదండ్రుల ఇష్టాన్ని.. మా కోసం వారు పడుతున్న కష్టాన్ని చూసి మేం కూడా కష్టపడి చదివాం. రానున్న రోజుల్లో నా ఆలోచనలను మరింత ప్రభావవంతంగా ముందుకు తీసుకెళ్తా.. – అయేషా



నాట్య సాధన మేటి బోధన

దాబాగార్డెన్స్: పాత పోస్టాఫీస్‌కు సమీపంలోని ఫోర్ట్ క్యాథలిక్ స్కూల్లో తొమ్మిదేళ్ల కిందట నాట్యగురువు ఇంద్రాణి నాట్యదీపిక కూచిపూడి అకాడమీని ప్రారంభించారు. ఇప్పటి వరకు వందలాది మంది పిల్లలకు నాట్యంలో శిక్షణ ఇచ్చారు. 2016లో ఇక్కడ శిక్షణ పొందిన ఏడుగురు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించారు. వీరిలో ఇద్దరు ముస్లింలు, ముగ్గురు హిందువులు, మరో ఇద్దరు క్రిస్టియన్ బాలికలు ఉన్నారు. ఏడుగురూ సంయుక్తంగా 180కి పైగా ప్రదర్శనలిచ్చారు. కాగా.. ఇంద్రాణి నాలుగో ఏటే నాట్యంపై మక్కువ పెంచుకున్నారు. ఫోర్ట్ క్యాథలిక్ గర్ల్స్ స్కూల్లో 2001లో తన విద్యాభ్యాసాన్ని మొదలు పెట్టి ఓ పక్క చదువు సాగిస్తూ.. నాట్యాన్ని అభ్యసించారు. బీఎస్సీ, బీఈడీతో పాటు నాట్యశాస్త్రంలోని కూచిపూడి విభాగంలో డబుల్ డిప్లమో సాధించారు. విద్యనభ్యసించిన పాఠశాలలోనే ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ.. నాట్యదీపిక కూచిపూడి అకాడమీని ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో నాట్య మయూరి, గురుశ్రేష్ఠ, నాట్యరవళి తదితర బిరుదులను ఆమె సొంతం చేసుకున్నారు. 2020లో ఇంటర్నేషనల్ ఎడ్యుకేషనల్ ఫోరమ్స్(ఆస్ట్రేలియా) విద్యారత్న అవార్డును ఆమెకు ప్రదానం చేసింది.



న్యూస్‌రీల్

20 నుంచి ఓటరు నమోదు ప్రక్రియ



మహారాణిపేట : జిల్లాలో కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ ఈ నెల 20 నుంచి చేపట్టనున్నారు. రాష్ట్రంలో కొత్త ఓటర్ల నమోదు, పాత ఓటర్ల జాబితాలో సవరణలకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఈ నెల 20 నుంచి బూత్ లెవెల్ ఆఫీసర్(బీఎల్‌వో)లు ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. వచ్చే ఏడాది జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండేవారు కూడా ఇప్పుడు ఓటరుగా నమోదు చేసుకోవచ్చును. అక్టోబర్ 18 నాటికి ప్రక్రియ పూర్తి చేసి, అదే నెల 29న ముసాయిదా ఓటర్లు జాబితా విడుదల చేయనున్నారు. నవంబర్ 28 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. జనవరి 6న తుది ఓటర్ల జాబితా ప్రకటించనున్నారు.

ఎయిడ్స్‌పై అవగాహనకు స్పెషల్ క్యాంపెయిన్

'మీకు తెలుసా' ప్రారంభం నేడు

మహారాణిపేట : హెచ్ఐవీ, లైంగికంగా సంక్రమించే అంటువ్యాధుల గురించి సమాచారాన్ని అందించేందుకు నేకో (నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ) నేతృత్వంలో మీకు తెలుసా కార్యక్రమం సోమవారం జిల్లాలో ప్రారంభం అవుతోంది. ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు రెండు నెలలపాటు రాష్ట్ర వ్యాప్తంగా 'ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్' నిర్వహించనున్నారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఈ కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సంగతి విదితమే. ఇందులో భాగంగా సోమవారం విశాఖలో నిర్వహించనున్న ర్యాలీలో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, ప్రజా ప్రతినిధులు, ఏపీ శాక్స్ అధికారులు పాల్గొంటారు. గ్రామస్థాయిలో గ్రామసభలు నిర్వహించి, అవగాహన కల్పిస్తామని జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు తెలిపారు.

సెవెన్ హిల్స్ ఆస్పత్రిలో అగ్నిప్రమాదం

- రోగులకు ఎలాంటి ఇబ్బంది లేదు
- ప్రమాద కారణాలపై విచారణ
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన సీపీ
- ఆస్పత్రుల్లో తరచూ ప్రమాదాలపై ఆందోళన



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది



ఆస్పత్రి వద్ద మీడియాతో మాట్లాడుతున్న సీపీ బాగ్చి

మహారాణిపేట : నగరంలోని సెవెన్ హిల్స్ ఆస్పత్రి ఐదో అంతస్తులోని హెచ్ఆర్ అండ్ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లో ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఫైల్స్, ఫర్నిచర్ కాలిపోయాయి. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయి. ఆస్పత్రిలో రోగులకు ఎటువంటి ఇబ్బంది కలగలేదని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఆదివారం కావడంతో హెచ్ఆర్ అండ్ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లో సిబ్బంది కూడా ఎవరూ లేరు. షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందని అగ్ని మాపక సిబ్బంది చెబుతున్నారు.

పోలీస్ కమిషనర్ సందర్శన

పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి ప్రమాద ఘటన తెలిసిన వెంటనే ఆస్పత్రి వద్దకు చేరుకొని పరిసరాలను పరిశీలించారు. అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతానికి వెళ్లి పరిస్థితులను స్వయంగా చూశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సంఘటనపై విచారణ చేస్తున్నామన్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బంది కలగలేదన్నారు. ఆస్పత్రి యాజమాన్యాలు తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఇటువంటి ప్రమాదాలు జరగవన్నారు.

మంటలు అదుపులోకి..

నాలుగు ఫైర్ ఇంజిన్లతో మంటలు అదుపులోకి తెచ్చామని జిల్లా అగ్నిమాపక శాఖాధికారి రేణుకయ్య తెలిపారు. స్కై లిఫ్ట్ ద్వారా నేరుగా ప్రమాదం జరిగిన అంతస్తులోనే వాటర్ స్ప్రే చేశామన్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బంది కలగలేదన్నారు. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో మంటలను అదుపు చేసే శిక్షణ కలిగిన సిబ్బంది ఆస్పత్రిలో లేరన్నారు. నష్టం వివరాలు ఇంకా తెలియలేదన్నారు.

ఫైర్ ఎన్‌వోసీ తనిఖీ : డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశాల మేరకు ఆస్పత్రిలో ఫైర్ ఎన్‌వోసీని జిల్లా మీడియా విస్తరణ అధికారి(డిమో) ఎం.నాగేశ్వరరావు ఆదివారం తనిఖీ చేశారు. 4,5,6 అంతస్తులను పరిశీలించారు. ఆస్పత్రికి ఫైర్ ఎన్‌వోసీ వచ్చే ఏడాది అక్టోబర్ వరకు ఉందని తెలిపారు.

వరుస ప్రమాదాలు : నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో తరచూ అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటుండడంతో ఆందోళన నెలకొంది. ఇటీవల ఇండస్ ఇండ్, మెడికవర్ ఆస్పత్రుల్లో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. దీంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగుల భద్రత ప్రశ్నార్థకంగానే మారింది. పర్యవేక్షణ లోపమా, లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అన్న ప్రశ్న తలెత్తుతోంది.

ప్రతీ ఇంటిపై త్రివర్ణ పతాక రెపరెపలు

- పౌరులందరూ భాగస్వాములు కావాలి
- సెల్ఫీ తీసుకుని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి
- జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్



దాబాగార్డెన్స్: 'త్రివర్ణ పతాకాన్ని ఎగరవేద్దాం.. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొందాం' అని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ నగర ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రతీ ఇంటిపై ప్రతి పౌరుడు త్రివర్ణ పతాకాన్ని ఎగర వేయాలని, భారత స్వాతంత్ర్య సంబరాలకు స్ఫూర్తిని కల్గించాలని కోరారు. తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం త్రివర్ణ పతాకాన్ని చేతబట్టి విశాఖ నగర ప్రజలకు స్ఫూర్తినిచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 2024 ఆగస్టు 15 భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశమంతా ఆగస్టు 9 నుంచి 15వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. విశాఖ నగర ప్రజలు, జీవీఎంసీ యంత్రాంగమంతా హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. భారత త్రివర్ణ పతాకం ఎగరవేస్తూ సెల్ఫీ తీసుకుని https://harghartiranga.com వెబ్‌సైట్లో నమోదు చేసి అప్‌లోడ్ చేయాలన్నారు. భారత స్వాతంత్ర్య సంబరాలకు స్వాగతం పలుకుతూ, స్వాతంత్ర్య దినోత్సవంలో ప్రతి పౌరుడు పాల్గొని, స్ఫూర్తిని కల్గించాలన్నారు.

క్యాన్సర్ చికిత్సలో సర్జరీ కీలకం

- సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కార్తీక్‌చంద్ర
- ఘనంగా ఏపీ ఓఎన్‌సీవో సమ్మిట్–2024



జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు

ఎంవీపీకాలనీ: క్యాన్సర్ చికిత్సలో శస్త్ర చికిత్సల పాత్ర ఎంతో కీలకమని ఎంవీపీ కాలనీ మెడికవర్ హాస్పిటల్ చీఫ్ కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కార్తీక్ చంద్ర అన్నారు. సర్జికల్ ఆంకాలజిస్టులు ఈ అంశంలో పూర్తి పురోగతి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) వైజాగ్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ సర్జికల్ ఆంకాలజీ (ఐఏఎస్ఓ) సంయుక్త ఆధ్వర్యంలో మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో 'ఏపీ సర్జికల్ ఆంకాలజిస్ట్ (క్యాన్సర్ సర్జన్స్) సమ్మిట్–2024'ను నిర్వహించింది. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్లో ఆదివారం నిర్వహించిన ఈ సదస్సులో ఐఏఎస్‌వో అధ్యక్షుడు ఎస్‌వీఎస్ దేవ్, ఐఎంఏ అధ్యక్షుడు జీజే శ్రీనివాస్, మెడికవర్ హాస్పటల్స్ రీజనల్ డైరెక్టర్ ఎస్.పద్మజ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కార్తీక్ చంద్ర మాట్లాడుతూ క్యాన్సర్ శస్త్ర చికిత్సల్లో పురోగతి, సాంకేతికత, అత్యుత్తమ సర్జరీలు, డాక్టర్ల అనుభవాలను పంచుకునేందుకు ఈ సదస్సు నిర్వహించినట్లు చెప్పారు. ముఖ్యమైన అంశాలపై ప్యానల్ చర్చలు, కీలక ఉపన్యాసాలు, సర్జరీల ప్రదర్శనలు జరిగినట్లు తెలిపారు. 200 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరైనట్లు వెల్లడించారు. డాక్టర్ ఎంవీఎస్ఎస్ బాపారావు, డాక్టర్ శిల్ప, డాక్టర్ లాలిత్య స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన సదస్సు రేపు

ఆరిలోవ: అవయవదానం దినోత్సవం సందర్భంగా ఈ నెల 13న అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జీవన్‌దాన్ రాష్ట్ర కో–ఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. ఇందుకు సంబంధించి వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 8 గంటలకు ఏయూ అవుట్ గేట్ నుంచి వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనా వరకు వాక్‌థాన్ చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం జరగనున్న సదస్సులో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ హాజరవుతారన్నారు.

15న శ్రీకాకుళం – నాందేడ్ మధ్య స్పెషల్ రైలు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా నాందేడ్–శ్రీకాకుళం రోడ్– నాందేడ్ (వయా దువ్వాడ మీదుగా) మధ్య సింగిల్ ట్రిప్ స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. నాందేడ్–శ్రీకాకుళంరోడ్(07487) స్పెషల్ 14వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు నాందేడ్‌లో బయల్దేరి మరసటిరోజు ఉదయం 9.10 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 9.12 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 12 గంటలకు శ్రీకాకుళం రోడ్ వెళ్తుంది. నాందేడ్–శ్రీకాకుళం రోడ్ (07488) స్పెషల్ 15వ తేదీ సాయంత్రం 5 గంటలకు శ్రీకాకుళం రోడ్‌లో బయల్దేరి అదే రోజు రాత్రి 7.33 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 7.35 గంటలకు బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 3.25 గంటలకు నాందేడ్ వెళ్తుంది.

• స్మార్ట్ వాచ్‌లే.. నెక్ బ్యాండ్సే.!







యాపిల్ ఇయర్ బడ్స్.. యాపిల్ స్మార్ట్ వాచ్.. సోనీ సౌండ్ బార్స్.. నెక్ బ్యాండ్స్.. హెడ్‌సెట్స్.. ఇలా ఒకటేమిటి.. జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్ల ఎలక్ట్రానిక్ ఉపకరణాలను రోడ్లపై పోసి.. కూరగాయలు అమ్మినట్లు అమ్మేస్తున్నారు. రూ.25 వేలు విలువ చేస్తే యాపిల్ వాచ్ జస్ట్ రూ.1,000 మాత్రమే. రూ.24 వేలు ఉన్న యాపిల్ ఇయర్ పాడ్స్ కేవలం రూ.1,100లే.. ఇలా కనీవినీ ఎరుగని ధరలతో నగరంలో రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ దర్శనమిస్తున్నాయి. తాటిచెట్లపాలెం, మద్దిలపాలెం, ఎంవీపీ కాలనీ, లాసెన్స్‌బే కాలనీ, ఇలా అనేక ప్రాంతాల్లో కూరగాయలు తెచ్చినట్లు బుట్టలతో మహిళలు సైతం ఈ ఎలక్ట్రానిక్ ఉపకరణాలు తీసుకొచ్చి రోడ్ల మీద పెట్టి అమ్మేస్తున్నారు. అలా అని ఇవి ఒరిజినల్ అనుకుంటే పొరపాటే. అయినప్పటికీ చాలా మంది వీటిని కొనుగోలుకు ఎగబడుతుండడం గమనార్హం.

- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

16వ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌కు స్వాగతం

గోపాలపట్నం: 16వ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ డాక్టర్ అరవింద్ పంగారియాకు విశాఖ విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. ఏయూఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగే 16వ ఫైనాన్స్ కమిషన్ సమావేశంలో ఆయన పాల్గొననున్నారు. ఈ సందర్భంగా విశాఖ చేరుకున్న ఆయనకు రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సెక్రటరీ జానకి, కలెక్టర్ హరేందర్ ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ విశాఖ విమానాశ్రయంలో పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

మాచ్‌ఖండ్‌లో మెరుగుపడిన విద్యుత్ ఉత్పత్తి



మూడో నంబర్ యూనిట్ వద్ద ప్రాజెక్టు అధికారులు

ముంచంగిపుట్టు: ఆంధ్రా ఒడిశా రాష్ట్రాల ఉమ్మడి నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో ఉత్పాదన మెరుగుపడింది. పూర్తి స్థాయిలో నీరు అందుబాటులో ఉన్నందున ప్రాజెక్టు అధికారులు ఉత్పత్తిపై దృష్టిపెట్టారు. ఈ ప్రాజెక్ట్‌లో ఆరు జనరేటర్ల సహయంతో 120 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి చేయాల్సి ఉంది. కొద్ది రోజులుగా 4,6వ నంబర్ల జనరేటర్లతో 46 మెగావాట్ల మేర విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. గత రెండు వారాలుగా మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రం అధికారులు, సిబ్బంది తీవ్రంగా శ్రమించి 3వ నెంబర్ జనరేటర్‌ను ఆదివారం ఉదయం అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో మూడు జనరేటర్ల సహాయంతో 66 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతోందని ప్రాజెక్ట్ అధికారవర్గాలు తెలిపాయి.

గజరాజసమేది?

భూమిపై నివసించే జంతువుల్లో అతి పెద్దది ఏనుగు. దీని సగటు జీవిత కాలం 70 ఏళ్లు. ఇది ఆహారం కోసం అడవిలో సుదూరం ప్రయాణించి అన్ని రకాల వండ్లను తింటుంది. అనంతరం దూర ప్రాంతాలకు వెళ్లి విసర్జన చేస్తుంది. ఆ విసర్జనలో పండ్ల గింజలు విత్తనాలుగా మారి అక్కడ చెట్లు పెరిగి దట్టమైన అడవి ఏర్పడుతుంది. అలా అడవుల విస్తీర్ణంలో ఏనుగు భాగస్వామి అవుతుంది. అటువంటి ఏనుగులు ప్రస్తుతం అంతరించిపోయే దశకు చేరాయి. వీటిపై ప్రపంచ ఏనుగుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం మీ కోసం...



- అంతరించిపోయే దశకు ఏనుగులు
- దేశంలో సుమారు 50 శాతం తగ్గుదల
- అడవుల నరికివేత, ఆహారం కొరతే ప్రధాన కారణం
- ఆంధ్రప్రదేశ్‌లో 242 ఏనుగులు ఉన్నట్లు నిర్ధారణ
- నేడు ప్రపంచ ఏనుగుల సంరక్షణ దినోత్సవం



ఏనుగులకు స్నానం చేయిస్తున్న మావటి(ఫైల్)

ఆరిలోవ : ప్రపంచంలో ఏనుగులు రెండు రకాలున్నాయి. ఆఫ్రికా ఏనుగులు, ఆసియా ఏనుగులు. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ అండ్ నేచురల్ రిసోర్స్(ఐయూసీఎస్) ప్రకారం ఆసియా ఖండపు ఏనుగులు అంతరించిపోయే దశలో ఉన్నాయని ఆ సంస్థ సర్వేలో వెల్లడైంది. ఏనుగుల దంతాలతో తయారు చేసిన అలంకరణ వస్తువులకు ప్రపంచ వ్యాప్తంగా మంచి గిరాకీ ఉంది. దీంతో స్మగ్లర్లు వాటి దంతాలతో వ్యాపారం చేస్తున్నారు. అదే వాటి సంఖ్య తగ్గిపోవడానికి కారణమైందని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. గడిచిన సుమారు 50 ఏళ్లలో 13 దేశాల్లో నివసించే ఆసియా ఏనుగులు 70 శాతం వరకు తగ్గిపోయినట్లు ఐయూసీఎస్ గుర్తించింది. అందులో మన దేశంలో సుమారు 50 శాతం ఏనుగులు తగ్గిపోయాయని నిర్ధారించింది. వాతావరణంలో తీవ్ర మార్పులు, అడవులు నరికేయడం, ఆహార భద్రత లేకపోవడంతో ఏనుగుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిపోయింది. వాటి పునరుత్పత్తికి అనువైన వాతావరణం లేకపోవడంతో ఆ సంఖ్య పెరుగుదల నిలిచిపోతోంది. పర్యావరణంలో ఏ ఒక్క జాతి తగ్గినా మానవాళికే ముప్పు కలగనుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని 2012లో ప్రపంచ ఏనుగుల సంరక్షణ దినోత్సవం జరుపుకోవాలని థాయ్‌లాండ్‌కు చెందిన 'ఎలిఫెంట్రీ ఇంట్రొడక్షన్ ఫౌండేషన్' అనే సంస్థ నిర్ణయించింది. మొదటిసారిగా అదే సంవత్సరం ఆగస్టు 12న థాయ్‌లాండ్‌లో ఏనుగుల సంరక్షణ దినోత్సవం నిర్వహించారు. అప్పట్లో వారి పిలుపుతో వివిధ దేశాల్లో 65కు పైగా అంతర్జాతీయ వన్యప్రాణి సంరక్షణ సంస్థలు ఏనుగుల సంరక్షణ కోసం ముందుకొచ్చాయి.

దేశంలో ఎలిఫెంట్ రిజర్వ్‌లు 33

2017లో ఏనుగుల సంఖ్య	2012లో ఏనుగుల సంఖ్య
27,312	31,368

అత్యధికంగా కర్ణాటకలో 6,500

దేశంలో 2012 తర్వాత ప్రత్యేకంగా ఎలిఫెంట్ రిజర్వ్‌లు ఏర్పాటు చేయడంతో వాటి సంరక్షణ పెరిగి పునరుత్పత్తి కూడా పెరిగి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం వాటి సంఖ్య 25,000 నుంచి 29,000 వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. వాటిలో ఆంధ్రప్రదేశ్‌లో 242 ఉన్నట్లు గుర్తించారు. అవి కూడా ఎక్కువగా శ్రీకాకుళం, చిత్తూరు అడవుల్లో కనిపిస్తున్నాయి.అన్నింటి కంటే ఎక్కువగా కర్ణాటకలో సుమారు 6,500 ఏనుగులు ఉన్నాయి. అత్యల్పంగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, మిజోరంలలో పది లోపే ఉన్నట్లు గుర్తించారు.

ఒక్కో ఏనుగుకు 220 కిలోల ఆహారం

విశాఖపట్నంలోని ఇందిరాగాంధీ జులాజికల్ పార్కులో సరస్వతి(58), లక్ష్మి(26), కృష్ణ(43), రాజు(16) అని పిలిచే నాలుగు ఏనుగులున్నాయి. రోజుకు ఒక్కోదానికి సుమారు 220 కిలోల ఆహారం అందిస్తారు. అందులో 40 కిలోల చెరకు, బెల్లం కలిపిన ఆరు కిలోల రాగి తోప, ఒక కిలో తవుడు, 120 కిలోల అరటి దవ్వ, 40 కిలోల గడ్డి, రెండు కొబ్బరి కాయలు, రెండు పుచ్చకాయలు, రెండు పెడలు అరటి పళ్లు, కిలో తోట కూర తదితర ఆహారం ఇస్తున్నారు. ఒక్కో ఏనుగు కనీసం 150 లీటర్ల నీరు తాగుతుంది.



రాగి సంగటి

దీనికి ఏడాదికి రూ.4.30 లక్షలు నిర్ణయించారు. జూలో అన్ని జంతువుల కంటే వీటికే ఖర్చు ఎక్కువ. అందుకే జంతు ప్రేమికులు ఎవ్వరూ వీటిని దత్తత తీసుకోవడానికి ముందుకు రాలేకపోతున్నారు.

ఏనుగులను సంరక్షిస్తున్నాం

ఇక్కడ నాలుగు ఏనుగులను పూర్తిస్థాయిలో సంరక్షిస్తున్నాం. వాటి కోసం ప్రత్యేకంగా నీటి కొలను నిర్మించాం. ఆహారంతో పాటు వైద్య సేవలు అందిస్తున్నాం. వాటి సంరక్షణ వ్యయంతో కూడుకున్నది. జంతు ప్రేమికులు వాటిని దత్తత తీసుకోవడానికి ముందుకు వస్తే బాగుంటుంది. ఏనుగుల సంరక్షణపై అవగాహన కల్పించడానికి పాఠశాల విద్యార్థులకు ఏటా పలు రకాల పోటీలు నిర్వహిస్తున్నాం.

–డాక్టర్ నందనీ సలారియా, జూ క్యూరేటర్

వేద విద్యార్థులను కొట్టిన ప్రిన్సిపాల్

- అలస్యంగా వెలుగులోకి ఘటన
- విచారణకు ఈవో ఆదేశం

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వేద పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ముగ్గురు విద్యార్థులను ప్రిన్సిపాల్ విచక్షణారహితంగా కొట్టిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలిలా ఉన్నాయి. వేద పాఠశాల ప్రిన్సిపాల్‌గా శ్రీకాంతాచార్యులు కొన్నేళ్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ నెల 8న పాఠశాలలో స్మార్త విద్యను అభ్యసిస్తున్న బిహార్‌కు చెందిన రవిరాజ్‌పాండేకు పాఠ్యాంశం బోధించే క్రమంలో ప్రిన్సిపాల్ కొట్టి గాయపరిచారు. వెంటనే సహచర విద్యార్థులు పాండేను ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అలా గే గత 15 రోజుల కిందట వేద విద్యార్థులు మారుతీశర్మ, భాస్కరశర్మలను కూడా కొట్టి గాయపరిచా రు. ఈ మేరకు ప్రిన్సిపాల్ వ్యవహారంపై విద్యార్థు లు ఈవోకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పరిశీలనకు ఈవో పాఠశాలకు వెళ్లిన సమయంలో ప్రిన్సిపాల్ విధుల్లో లేరు. దీంతో విచారణకు సూపరింటెండెంట్‌ను ఆదేశించి నివేదిక ఇవ్వాలని ఈవో సూచించారు.

ఏవరిది ఈ 'పాప'ం?



రామ్‌నగర్ గెడ్డలో ఆడ శిశువు మృతదేహం

మల్కాపురం: ఆ తల్లికి కష్టం వచ్చిందా? లేదా కడుపున పుట్టిన ఆడ బిడ్డ భారం అనుకుందా? ఇంకేదైనా కారణమా? తెలియదు గానీ.. అభం శుభం తెలియని శిశువు తన ఆశలు తీరకుండానే గెడ్డలో నిర్జీవంగా కనిపించింది. జీవీఎంసీ 58వ వార్డు పరిధి రామ్‌నగర్ గెడ్డలో మరో ఆడ శిశువు మృతదేహం లభ్యమై కలకలం రేగింది. ఆదివారం తెల్లవారుజామున గెడ్డలో చెత్త పారవేసేందుకు వెళ్లిన స్థానికులు.. శిశువు మృతదేహాన్ని గమనించి స్థానిక నాయకుడు పాతబత్తుల శ్రీనుకు సమాచారం అందించారు. ఆయన ఫిర్యాదు మేరకు మల్కాపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. సీఐ విద్యాసాగర్ ఆశ కార్యకర్తలతో మాట్లాడారు. స్థానికంగా ఉన్న గర్భిణుల వివరాలు సేకరించారు. గత నెల 18న ఇదే ప్రాంతానికి సమీపంలోని కారాడవారి వీధి వద్ద కాలువలో 7 నెలల ఆడ శిశువును ఓ తల్లి నిర్లక్ష్యంగా విడిచిపెట్టింది. తమ ప్రాంతంలో వరుసగా ఇలాంటి ఘటనలు జరగడం బాధాకరంగా ఉందని, శిశువును నిర్లక్ష్యంగా విడిచిపెట్టిన వారిని కఠినంగా శిక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సూపర్‌గ్లోబ్ సీజన్-3లో మెరిసిన యశ్వంత్



తాటిచెట్లపాలెం: బ్యాంకాక్‌లో ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన సూపర్ గ్లోబ్ సీజన్-3 ఫైనల్స్‌లో విశాఖ యువకుడు యశ్వంత్ ప్రేమ తొలి రన్నరప్‌గా నిలిచాడు. తన అందం, ప్రతిభతో అంతర్జాతీయ పోటీల్లో రాణించాడు. యశ్వంత్ ప్రేమ భారత ప్రతినిధిగా వరల్డ్ ఫైనల్స్-2024 పోటీల్లో పాల్గొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద బ్యూటీ ఈవెంట్‌గా పేరుగాంచిన సూపర్ గ్లోబ్ (మిస్టర్ అండ్ మిసెస్ టీన్) సీజన్-3లో విశాఖ వాసి తొలి రన్నర్‌గా నిలవడంపై పలువురు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. యశ్వంత్ తండ్రి పి.శోభన్‌బాబు విశాఖపట్నం సిటీ, సీసీఎస్ విభాగంలో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల కోల్‌కతాలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లోనూ ప్రిన్స్ ఆఫ్ ఏపీ ఇండియా-2024గా నిలిచాడు. తన విజయానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి యశ్వంత్ కృతజ్ఞతలు తెలిపాడు.

వివాహిత ఆత్మహత్య

ఆరిలోవ: ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఆరిలోవ ప్రాంతం శ్రీకాంత్‌నగర్‌లో ఉషా వినయసూర్య చంద్రిక(27), తన భర్త శివాజీ నివాసముంటున్నారు. ఇద్దరూ 2021లో ప్రేమ వివాహం చేసుకున్నారు. అనంతరం కొన్నాళ్ల పాటు అక్కయ్యపాలెంలో నివాసముండేవారు. ఇటీవల ఆరిలోవ శ్రీకాంత్‌నగర్‌కు వచ్చారు. వీరికి నాలుగు నెలల బాబు ఉన్నాడు. కొద్ది రోజులుగా ఇంట్లో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. భర్త శివాజీతో పాటు అత్త అక్కునాడు మణి, మామ అప్పారావు, కుటుంబ సభ్యులు కలసి చంద్రికను వేధిస్తున్నారు. దీంతో ఆమె శనివారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం అత్తంటివారు పెందుర్తి ప్రాంతం చినముషిడివాడలో ఉంటున్న మృతురాలి తల్లిదండ్రులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. బాధిత తల్లిదండ్రులు ఆరిలోవ వచ్చి తన కుమార్తె ఆత్మహత్యకు భర్త శివాజీ, అత్తమామలు, కుటుంబ సభ్యులు కారణమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆదివారం కేసు నమోదు చేసిన ఎస్ఐ కృష్ణ దర్యాప్తు చేస్తున్నారు.

కావడి భుజాన పెట్టి.. నగరమంతా చుట్టి..





బీచ్‌రోడ్: నగరంలోని మార్వాడీలంతా కాషాయ వస్త్రాలు ధరించి భక్తి శ్రద్ధలతో శోభాయాత్ర నిర్వహించారు. మార్వాడీ యువ మంచ్ ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారు జామున 4 గంటలకు తమ కుటుంబ సభ్యులతో మాధవధార శివాలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇక్కడ నిరంతరం ప్రవహించే జలధారను కుండల్లో పట్టుకుని కావడి యాత్రను ప్రారంభించారు. మాధవధార, బిర్లా కూడలి, కంచరపాలెం, తాటిచెట్లపాలెం, న్యూకాలనీ, తెలుగుతల్లి బ్రిడ్జి, సిరిపురం మీదుగా బీచ్ రోడ్డులోని పాండురంగాపురంలోని శివాలయం వరకు శోభాయాత్ర సాగింది. ఈ జలధారతో అక్కడి స్వామివారి విగ్రహానికి అభిషేకం చేసి యాత్రను ముగించారు.

- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



శోభా యాత్రలో పాల్గొన్న మార్వాడీలు



మురుగునీరు వెళ్లేదెలా?

జ్ఞానాపురం దయాల్‌నగర్ నుంచి పోర్టు ఏరియాలోకి వెళ్లే ప్రధాన కాలువ మురుగు కూపంగా మారింది. చెత్తాచెదారాలు, వ్యర్థాలు కాలువలో పేరుకుపోయి మురుగు కదలని పరిస్థితి ఏర్పడింది. మాంసం, చేపలు, కొబ్బరి బొండాలు, మద్యం తాగేసిన ఖాళీ సీసాలు, గ్లాసులు, పాలిథిన్ కవర్లు, ఇతర వ్యర్థాలను సైతం కాలువలో వేయడంతో తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోంది. ఆ వ్యర్థాలపై పందులు గుంపులుగా చేరి చెల్లాచెదురు చేస్తున్నారు. దోమలు బెడద కూడా తీవ్రంగా ఉంది.

ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



